
జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజా జ్యోతి
ప్రతిఅక్షరం - ప్రజల కొసం
ఖమ్మం
ఆదివారం 23-6-2024
పేజీలు :8



# బొగ్గు గనులను వేలం వేస్తే ఊరుకోం

పాల్వంచ, జూన్ 22 : జాతీయ సంపద అయిన బొగ్గు గనులను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వేలం వేయాలని చూస్తోందని.. ఎట్టి పరిస్థితుల్లోనూ ఊరుకునేదిలేదని, సింగరేణి ప్రైవేటీకరణను జరగనివ్వమని కార్మిక సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శనివారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. పాల్వంచ పట్టణంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దొడ్డా రవి, పట్టణ కార్యదర్శి సత్య మాట్లాడుతూ దేశంలోని 60 బొగ్గు బావులను కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరించేందుకు చూస్తోందని, అన్నిరంగాల కార్మికులు ఉద్యమించాలని అన్నారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి గనులశాఖ పదవి చేపట్టగానే తెలంగాణకు తీరని అన్యాయం చేయబోతున్నారని విమర్శించారు. శ్రావణపల్లి బొగ్గు బ్లాకును వేలం వేయడం శోచనీయమన్నారు. నిరసన కార్యక్రమంలో గట్టయ్య, మహేశ్, సాయి, శ్రీను, సామేలు పాల్గొన్నారు.

## సింగరేణి పరిరక్షణకు ఆందోళనలు

**వేలం పాట ఉపసంహరించుకోవాలి -సిపిఐ**

**ఖమ్మం జూన్ 22 ప్రజా జ్యోతి**



సింగరేణి పరిధిలోని బొగ్గు బ్లాకుల వేలాన్ని ప్రభుత్వం తక్షణం ఉప సంహరించుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా బొగ్గు వేలం పాటలను అడ్డుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ కోరారు. ఇప్పటికే సింగరేణి సంస్థ రోజు రోజుకు కుచించుకుపోతున్నదని ఈ నేపథ్యంలో సింగరేణి పరిధిలోని బొగ్గు బ్లాకులను వేలం వేస్తే మనుగడే ప్రమాదంలో పడుతుందన్నారు. కేంద్రం ప్రైవేటు వ్యక్తులకు జాతి సంపదను కట్ట బెడుతుదని ప్రసాద్ ఆరోపించారు. గతంలో లక్షకు పైబడిన కార్మికులు కోట్లాది రూపాయల టర్నోవర్తో సిరుల తల్లిగా పేరొందిన సింగరేణి ఇప్పుడు బొగ్గు నిక్షేపాలు కరువై యాంత్రీకరణ పెరిగి కార్మికుల సంఖ్య గణనీయంగా -తగ్గిందని ఆయన తెలిపారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం సింగరేణి విషయంలో అటు బిజెపికి మద్దతునిస్తూ ఇటు -వేలం పాటలకు పోకుండా అడ్డుకుని భవితవ్యాన్ని దెబ్బతీసిందని ఆయన తెలిపారు. ఇప్పటికే కోయగూడెం ఉపరితల గనిని అరబిందో కంపెనీకి అప్పగించిందని సత్తుపల్లి ఓసిని మరో ప్రైవేటు సంస్థకు కట్టబెట్టిన బిజెపి ఇప్పుడు మరో మూడు బొగ్గు బ్లాకులను వేలం వేయడాన్ని సిపిఐ తీవ్రంగా నిరసిస్తుందన్నారు. సింగరేణి పరిరక్షణ కోసం సిపిఐ నేతృత్వంలో కమ్యూనిస్టులు అనేక త్యాగాలు చేశారని, సింగరేణి పరిరక్షణకు మరో ఉద్యమానికి సిద్ధం కావాలని సిపిఐ పిలుపు నిస్తుందన్నారు. సిపిఐ నేతృత్వంలో వేలం పాటలను ప్రైవేటు సంస్థలు బొగ్గు తీయడాన్ని -అడ్డుకుంటామని ప్రసాద్ స్పష్టం చేశారు. కార్మికులు, పార్టీ కార్యకర్తలు సింగరేణి పరిరక్షణకు ప్రతినబూనాలన్నారు.



# వర్షం.. హర్షం

**ఉమ్మడి ఖమ్మం జిల్లావ్యాప్తంగా మోస్తరు వర్షం**

**హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు  కరకగూడెంలో భారీ వాన**

**ఖమ్మం నగరవాసులకు ఉపశమనం**

**ఖమ్మం వ్యవసాయం/కూసుమంచి/అశ్వారావుపేట టౌన్/కరకగూడెం/పెనుబల్లి, జూన్ 22 :** ఉమ్మడి ఖమ్మం జిల్లావ్యాప్తంగా శనివారం మోస్తరు వర్షం కురిసింది. విత్తనాలు పెట్టి ఎదురుచూస్తున్న రైతన్నల కళ్లల్లో ఆనందం నింపింది. వ్యవసాయం సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి సరైన వాన కురవకపోవడంతో అన్నదాతలు నిరాశలో ఉన్నారు. భూమిలో పెట్టిన పత్తి విత్తనాలు మొలకెత్తకపోవడంతో భయంభయంగా ఉన్న రైతులు శనివారం కురిసిన వర్షంతో ఊపిరిపీల్చుకున్నారు. ఉపరితల ఆవర్తనం, నైరుతి రుతుపవనాల ప్రభావంతో వర్షాలు కురుస్తుండడంతో రైతులందరూ విత్తనాలు పెట్టేందుకు సిద్ధమవుతున్నారు. వ్యవసాయ బోర్లు, చెరువుల కింద వరి నారుమళ్లు సిద్ధం చేసుకుంటున్నారు. మరో రెండు, మూడు వర్షాలు కురిస్తే వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతాయని రైతులు చెబుతున్నారు. కరకగూడెం మండలవ్యాప్తంగా శుక్రవారం అర్ధరాత్రి నుంచి

మిగతా 6లో



- వచ్చే నెల నుంచి రూ.31 వేల కోట్లతో రుణమాఫీ అమలు
- నేలకొండపల్లి మండల పర్యటనలో మంత్రి పొంగులేటి

# హామీలను నెరవేర్చడంలో వెనక్కు తగ్గే ప్రసక్తే లేదు...!



**ఖమ్మం ప్రతినిధి జూన్ 22 ప్రజా జ్యోతి. :** పేదలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఇందిరమ్మ ప్రభుత్వం వెనక్కు తగ్గే ప్రసక్తే లేదని, ఎన్నికల సమయంలో ఏ హామీలను ఇచ్చామో వాటన్నింటిని విడతల వారిగా నెరవేర్చేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. నేలకొండపల్లి మండల పర్యటనలో భాగంగా మోటాపురం, శంకరగిరి తండా, రాజేశ్వరపురం, అమ్మగూడెం, కోరట్లగూడెం, కోనాయిగూడెం, అరెగూడెం, ఆచార్లగూడెం, బోదులబండ, మంగ్రాజుపల్లి తదితర గ్రామాలను సందర్శించారు. ఆయా గ్రామాల్లో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ... ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రుణమాఫీ కోసం అన్ని సమకూరుస్తున్నామన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో వచ్చేనెల జూలై నుంచి రుణమాఫీ అమలవుతుందని తెలిపారు. రూ.31 వేల కోట్లతో రైతుల రుణమాఫీ జరుగుతుందని వెల్లడించారు. ప్రభుత్వం చేయబోయే రుణమాఫీని తట్టుకోలేక ప్రతిపక్షం వాళ్లు నోరుజారి ఏవేవో మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్లు పేదవాళ్లలో అతిపేదవాళ్లకు ముందు మంజూరు చేస్తామన్నారు. లిఫ్ట్ లు రిపేరు చేయించి రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. రాజేశ్వరపురం గ్రామంలో నేలకొండపల్లి మండల కళ్యాణ లక్ష్మి లబ్దిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ పర్యటనలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు  పాల్గొన్నారు.

# రైతుల పాలిట పెన్నిధి.. సీఎం రేవంత్ రెడ్డి

- సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేసిన ఎమ్మెల్యే. - ఏక కాలం లో 2లక్షల రుణమాఫీ పై ఎంఎల్ఏ,రైతులు హర్షం.



**సత్తుపల్లి జూన్22 ప్రజా జ్యోతి ఆర్సి:** కాంగ్రెస్ ప్రభుత్వం మాటకు కట్టుబడే ప్రభుత్వం అని.... ఇచ్చిన మాటను నిలబెట్టుకునే సీఎం రేవంత్ రెడ్డి అని రైతులు రుణమాఫీ ఏకకాలంలో 2 లక్షలు రుణమాఫీ ప్రకటించడంతో, క్యాబినెట్ రుణమాఫీ పై నిర్ణయం తీసుకోవడం పై శనివారం సత్తుపల్లి శాసనసభ్యురాలు మట్ట రాగమయి దయానంద్, రైతులు ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి , పొంగులేటి, తుమ్మల,బట్టి చిత్రపటాలకి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల పక్షపాతి కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేయలేదని... ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండటమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని... రాష్ట్ర మంత్రి వర్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్వీట్స్ పంపిణీ చేసి రైతులు కూడా సీఎం,మంత్రుల చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. 31 వేల కోట్లు రూపాయలతో రుణమాఫీ చేయటం రైతులకు మంచి భరోసా ఇచ్చినట్లు... రైతుల పాలిట పెన్నిధి గా సీఎం పై అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చల్లగుండ్ల నరసింహారావు ఉడతనేని అప్పారావు గాదె చెన్నారావు కమల్ పాష ఆనంద్ గొర్ల మారి రామ్మోహన్ రెడ్డి కొప్పుల నరేందర్ రెడ్డి డివెన్ చారి పింగళి సామేలు కాంగ్రెస్ కార్యకర్తలు రైతులు మహిళలు తదితరులున్నారు

# బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

**అరకింట బియ్యంతో పాటు నగదు అందజేసిన ఎస్కే గౌసుద్దీన్ .**

**కారేపల్లి,జూన్22, ప్రజాజ్యోతి:** ఆర్థిక ఇబ్బందులతో కుటుంబ పోషణ భారంగా ఉన్న పలు బాధిత కుటుంబాలకు నేనున్నానంటూ,తనకు తోచిన సాయం చేస్తున్నారు బిఆర్ఎస్ జిల్లా మైనార్టీ నాయకులు ఎస్కే గౌసుద్దీన్. సింగరేణి మండల కేంద్రం కారేపల్లి లోని పెద్దమ్మ గడ్డ కాలనీకి చెందిన దుండి నారాయణ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. వారి దశదినకర్మల్లో భాగంగా శనివారం అరకింట బియ్యంతో పాటు 3000 రూపాయల నగదును బాధిత కుటుంబానికి అందజేసి తన ఔదార్యాన్ని చాటుకున్నారు.దుండి నారాయణ చిత్రపటానికి నివాళులర్పించి,కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.వారి కుటుంబానికి అన్నివేళలా అండగా ఉంటానని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో




బిఆర్ఎస్ నాయకులు ఎండి కలియుల్లాఖాన్,పేర్ని వెంకటేశ్వర్లు, తురక రవి, దుండి సీతారాములు,దుండి కోటయ్య,దుండి నాగేశ్వరావు, తెలంగాణ ఉద్యమకారుడు సోమందుల నాగరాజు, హమాలి సంఘం నాయకులు తురక రాంబాబు,జూపల్లి వెంకన్న, గోపి, రామారావు, విజయ్, కొడుదల కృష్ణ,సద్దాం హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ స్థాయిలో మార్కెట్ యార్డు నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం

- 148.5 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదన - మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించిన తుమ్మల

**ఖమ్మం ప్రతినిధి జూన్ 22 ప్రజా జ్యోతి.:** ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీలో ప్రస్తుతం ఉన్న మిర్చి యార్డు నిర్మాణం 15 ఎకరాలలో నిర్మించబడింది. మార్కెట్ యార్డు ఏర్పాటైన తొలినాళ్లలో మిర్చి, పత్తి పంట సాగు తక్కువగా ఉండటంతో రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోలేదు. కానీ కాలక్రమేణా మిర్చి, పత్తి పంట సాగు పెరుగుతూ వచ్చింది. అయితే గత 10 ఏళ్లలో తెలంగాణ అంతటా మిర్చి, పత్తి పంట సాగు గణనీయంగా పెరిగింది. అంతేకాకుండా పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ సరిహద్దు జిల్లాల నుండి కూడా మార్కెట్ యార్డుకు సరుకుల రాబడి పెరిగింది. దీనివలన ప్రస్తుతం ఉన్నటువంటి మిర్చియార్డు సరియైన పద్ధతిలో లేనందున రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సీజన్ సమయాలలో 1 లక్ష కంటే ఎక్కువ బస్తాల పంట మార్కెట్ కి వస్తుంది. ఇలాంటి పరిస్థితులలో మార్కెట్ యార్డు స్థలం తక్కువగా ఉండటం మరియు సరియైన మౌళికసదుపాయాలు లేకపోవడం వలన రైతులు తమ పంటను రోడ్లపై వేసుకోవడం జరుగుతుంది. కొన్నిసార్లు 1 కి.మీ కు పైన రోడ్ల మీద రైతులు తమ పంటను ఉంచుకోవడం జరుగుతుంది. 2017 లో దాదాపు 1,50,000 మిర్చి బస్తాలు మార్కెట్ యార్డుకి వచ్చాయి. కానీ సరియైన సదుపాయాలు లేనందున వీటిని రోడ్డుపై వేశారు. ఇది సామాన్య ప్రజలకు అలాగే వాహనదారులకు తీవ్ర ఇబ్బందులను కలిగిస్తుంది. అంతేకాకుండా సరియైన సదుపాయాలు లేని కారణంగా కొంతమంది రైతులు వేరే మార్కెట్ యార్డుకి తరలిపోవడం వలన ఖమ్మం మార్కెట్ యార్డుకి నష్టం కూడా వాటిల్లుతుంది. ఈ






విషయాలన్నీ దృష్టిలో ఉంచుకొని, రైతుల సౌకర్యార్థం అంతర్జాతీయ స్థాయిలో మార్కెట్ యార్డును పునఃనిర్మించుటకు గౌరవ మంత్రివర్యులు శ్రీ తుమ్మల నాగేశ్వరరావు మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. తదనుగుణంగా ఈ రోజు మార్కెటింగ్ శాఖ వారు ప్రతిపాదిత డిజైన్లను మంత్రి పరిశీలనార్థం చూపెట్టగా, దానిలో కొన్ని మార్పులను గౌరవమంత్రి ప్రతిపాదించడం జరిగింది. అన్ని సాంకేతికపరమైన అంశాలను పరిగణలోనికి తీసుకోవల్సిందిగా మంత్రి అధికారులకు సూచించారు. ప్రతిపాదిత నమూనాతో మార్కెటింగ్ శాఖ అధికారులు అన్ని మౌళికసదుపాయాలతో 148.5 కోట్ల అంచనా విలువతో నివేదికను ఈరోజు ప్రభుత్వ ఆమోదానికి పంపించడం జరిగింది.

# కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ.




**ముదిగొండ జూన్ 22(ప్రజా జ్యోతి:** రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన 27 కళ్యాణలక్ష్మి చెక్కులను మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ సామినేని హరిప్రసాద్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కళ్యాణలక్ష్మి చెక్కులను జాగ్రత్తగా లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో వైస్ ఎంపీపీ మంకెన దామోదర్ ఇంచార్జ్ తాసిల్దార్ తిరుమల కరుణాకర్ రెడ్డి,జెడ్పిటిసి సభ్యురాలు పసుపులేటి దుర్గ, ఆర్ఐ ఎస్కే వహీదాబేగం తదితరులు పాల్గొన్నారు.

# ఒకే దఫాలో 2 లక్షల రుణమాఫీ పై రైతులు హర్షం

**కల్లూరు జూన్ 22(ప్రజా జ్యోతి):** ఒకే దఫాలో రెండు లక్షల రుణమాఫీ పట్ల మండల రైతాంగం,రాజకీయ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సీఎం రేవంత్ రెడ్డి,ఎమ్మెల్యే మట్టా రాగమయి చిత్రపటాలకు శనివారం పాలాభిషేకం చేశారు.ఈ సందర్భంగా పసుమర్తి చంద్రావు మాట్లాడుతూ 2 లక్షల రూపాయలు ఏకకాలంలో మాఫీ చేసిన ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని గర్వంగా చెప్పారు.తెలంగాణ రాష్ట్ర రైతాంగానికి ఒకే దఫాలో రెండు లక్షల రుణమాఫీ ప్రకటించిన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.క్యాబినెట్లో ఈ నిర్ణయం తీసుకొని ప్రకటించడం చాలా సంతోషకరమని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం మాట ఇస్తే మరిచిపోయే ప్రభుత్వం కాదని ఆయన అన్నారు.ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క,వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు,పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,సత్తుపల్లి శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ కి రైతులు,నాయకులు అభిమానులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పసుమర్తి చంద్రావు,భాగం ప్రభాకర్ చౌదరి,ధారా రంగ,మచ్చ వెంకటేశ్వరరావు,విజయ రావు,నల్లగట్ల కిషోర్,బైర్ల కాంతారావు,విజయ దాస్, రైతులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





## జిల్లా స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

**ఏన్కూరు జూన్ 22 ప్రజాజ్యోతి:** శనివారం ఏన్కూరులోని గురుకుల పాఠశాలలో తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్లో ప్రవేశాలకు గాను నాలుగవ తరగతి విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. స్థానిక ఎస్ఐ బాదావత్ రవి ఆధ్వర్యంలో పోటీలను ప్రారంభించారు. తొమ్మిది రకాల ఈవెంట్స్ లలో బ్యాటరీ టెస్ట్ నిర్వహించి,కనీసం 10 మార్కులు దాటిన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ జయరాజు, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి, తిమ్మరావుపేట ఓం ఆదిత్య గాయత్రి స్కూల్ ప్రిన్సిపాల్ దాసరి రమేష్,వ్యాయామ ఉపాధ్యాయులు పొదెం వీరయ్య, భూక్యా రమేష్, శ్రీను, రమేష్, శోభన్ తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ నాయకుల బడా దందా

**ప్రజలకు మేలు చేస్తున్నట్టు బిల్డప్ రాజకీయాలతో సొంత ఆస్తిపాస్తులే లక్ష్యం**



**తిరుమలాయపాలెం, జూన్ 22, ప్రజా జ్యోతి :** తిరుమలాయపాలెం మండలం, మండల కేంద్రం అభివృద్ధి చెందకపోవడానికి అనేక కారణాలలో ప్రధానమైన కారణం కొంతమంది రాజకీయ నాయకులే అని తిరుమలాయపాలెం మండల సహాయక, సామాజిక సంఘం అధ్యక్ష ముఖ్య కార్యకర్తలు పదముత్తం కిరణ్ కుమార్, నూకతోటి సాల్మన్, ఉండేటి ధర్మరాజు కార్యకర్తల సమక్షంలో మాట్లాడుతూ మండలంలో రాజకీయ నాయకుల ఆస్తులు పెరుగుతున్నాయి తప్ప ప్రజలకు మేలు లేదు సొంత అవసరాల కోసం బ్యాక్ గ్రౌండ్ రాజకీయాలు రాజకీయ నాయకులు చేస్తూ ప్రజల మెప్పు పొందటానికి బహిర్గతమైన మాటలు, బహిర్గతమైన ప్రసంగాలలో పైకి మాట్లాడుతూ అంతర్గతంగా ఆస్తులు సంపాదనే లక్ష్యం, ఏ కూలి పనులు చేయలేదు ఏ వ్యాపారాలు చేయలేదు రాజకీయ నాయకులకు ఎక్కడి నుంచి వచ్చింది ఈ సంపాదన గగ్గోలు పెట్టుతున్న మండల ప్రజల గొంతుకులా మేము నిలుస్తాం.... కొంతమంది స్వార్థపూరిత రాజకీయ నాయకులు వ్యక్తిగత ప్రయోజనాలు కాకుండా నిస్వార్థమైన రాజకీయాలతో వ్యక్తిగత ప్రయోజనాలు పొందకుండా గ్రామ, మండల అభివృద్ధి కోసం పాటుపడితే ఎప్పుడో మన మండలం అభివృద్ధి చెందేది. ప్రజలు అవగాహన పెంచుకొని రాజకీయ నాయకులకు అతీతంగా ప్రజలు పరిణితి చెంది మనం మండల కేంద్రాన్ని మండలాన్ని మనమే అభివృద్ధి చేసుకోవాలని వారు ఆకాంక్షించారు రాజకీయ నాయకుల యోజనాలయితే 100% నెరవేరుతాయి గ్రామం, మండల ప్రయోజనాల కోసం పైకి మాట్లాడి అంతర్గతంగా స్వలాభం కోసం పోరాటం, రాజకీయాలు సొలాభం కోసమేనా, ప్రజల సంక్షేమం కోసం కాదా.... ప్రజల అవసరాల కోసం ఏ నాయకుడు లేదు అన్న విధంగా మండల రాజకీయాలు ప్రత్యక్షంగా కనబడుతున్నాయని రాజకీయ నాయకులకి బుద్ధి చెప్తాం.... మండల ప్రజలు చీకటి ఒప్పందాలు రహస్య కూటములు అన్ని గమనిస్తున్నారు ఇకనైనా స్వార్థపూరిత రాజకీయాలు వదిలేసి ప్రజలకు మేలు చేయాలని, నిష్పక్షపాత రాజకీయాలు చేయాలని మండల ప్రజలుఏకాభిప్రాయంతో కోరుకుంటున్నారు రాబోయే రోజుల్లో ప్రజా సంక్షేమం కోసం గ్రామ మండల అభివృద్ధి కోసం ఏ పోరాటాల కైనా సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి రాజేశం గౌడ్ ను కలిసిన రాష్ట్ర అధ్యక్షులు కేశవ్..

**తల్లాడ, జూన్ 22 (ప్రజా జ్యోతి న్యూస్):** తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి, ఆర్థిక ఫైనాన్స్ కార్పొరేషన్ కమిటీ చైర్మన్ వరిసెల రాజేశం గౌడ్ ను తెలంగాణ ఏజెన్సీప్రాంత గౌడ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు కంటే కేశవ్ గౌడ్ కలిశారు. శనివారం జగిత్యాల పట్టణంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ సామాజిక వర్గానికి సంబంధించిన పలు సమస్యలపై ఆయనతో చర్చించారు. సామాజిక వర్గంలో వెనకబడిన వారికి ప్రభుత్వం ఆదుకునేలా చర్యలు తీసుకోవాలని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఆయన సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. గత రెండు రోజుల నుంచి రాష్ట్రంలో ప్రముఖుల అందరిని కలిసి ఎస్సీ, ఎస్టీ బీసీ మైనారిటీ వర్గాల సమస్యలను వారి దృష్టికి తీసుకెళుతున్నట్లు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం తాను నిరంతరం అందుబాటులో ఉంటానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.




## బహుజన కులాలు విముక్తి చెందాలంటే అంబేద్కరిజమే శరణ్యం

**బి ఎస్.పి పాలేరు నియోజవర్గ ఇన్చార్జి మట్టే నాగేశ్వరరావు**



**తిరుమలయపాలెం, జూన్ 22, ప్రజా జ్యోతి :** బహుజన కులాలు విముక్తి చెందాలంటే అంబేద్కర్ ఆశయాలే శరణ్యమని బి ఎస్ పి పాలేరు నియోజకవర్గ ఇన్చార్జి మట్టె నాగేశ్వరావు తెలిపారు శుక్రవారం రాత్రి తిరుమలాయపాలెం మండల కేంద్రంలోని అంబేద్కర్ జ్ఞాన పరివర్తన ప్రాంగణం లో జరిగిన సమావేశం లో మట్టె నాగేశ్వరావు మాట్లాడుతూ భారతదేశంలోని బహుజన కులాలకు బానిస విముక్తి జరగాలంటే అంబేద్కరిజమే మనకు శరణ్యమని, మహాత్మ జ్యోతిబాపూలే, చత్రపతి సాహు మహారాజ్, నారాయణ గురు, పెరియర్ రామస్వామి నాయక్, మహనీయుల ఆలోచనల ను, ఆచరణ రూపంలో చేసి చూపించిన రాజకీయ పోరాట యోధుడు మాన్యవర్ కాన్షీరాం స్ఫూర్తి తో ఈ తెలంగాణ రాష్ట్రంలో బహుజన కులాల అందరిని ఏకం చేసి, మహనీయులు కలలు కన్నా, మాన్య వర్ కాన్షీరాం చెప్పిన ఈ భారతదేశాన్ని పరిపాలించడమే మన అంతిమ లక్ష్యమని అన్నారు, రాజ్యాధికారానికి రాని జాతులు అంతరించిపోతాయని తండ్రి బాబాసాహెబ్ తెలిపారు కాబట్టి యువతీ యువకులు గొప్పగా ఉన్నత చదువులు చదివి, గొప్పగా వివిధ స్థాయిలో ఉన్న ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, వారు ఎక్కడ నుండి వచ్చామనేది గుర్తెరిగి తండ్రి బాబాసాహెబ్ అంబేద్కర్ కలలు గన్న రాజ్య స్థాపనకు, మన మందరం, సంఘటితం , కావాలి, గ్రామాలలో మనం పనిలో ఉండాలి అని తెలిపారు.. నాయకులు, కొమ్ము పూలే, కె వీరబాబు, సురేష్, నితీష్, కె కళ్యాణ్, కె వినయ్, కె ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

## నరసింహారావును సన్మానించిన మాజీ సర్పంచ్ మమత..

**తల్లాడ, జూన్ 22 (ప్రజా జ్యోతి న్యూస్):** తల్లాడ మండలంలోని అన్నారుగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా విధులు నిర్వహించి బదిలీపై



పెద్దగోపతి పాఠశాలకు వెళ్లిన మాదినేని నరసింహారావును అన్నారుగూడెం మాజీ సర్పంచ్ మారెళ్ళ మమత, కాంగ్రెస్ పార్టీ నాయకులు తుమ్మలపల్లి రమేష్ సన్మానించారు. శనివారం అన్నారుగూడెం పాఠశాలలో సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను వారు శాలువాలు, పూలమాలలతో సన్మానించి సత్కరించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు పొన్నం కృష్ణయ్య, దుగ్గినేని వెంకటయ్య, ముస్లిం మైనార్టీ నాయకులు షేక్. యాకూబ్ పాషా, పలువురు ఉపాధ్యాయులు ఉన్నారు.

## భాగం బాగేశ్వరరావుకు టిడిపి నాయకులు ఘన నివాళి

**బోనకల్, జూన్ 22, ప్రజాజ్యోతి:**మండల పరిధిలోని గోవిందపురం (ఏ) గ్రామానికి చెందిన టిడిపి జిల్లా నాయకులు భాగం రమేష్



తండ్రి టిడిపి సీనియర్ నాయకులు భాగం భాగేశ్వరరావు ఇటీవలే మృతి చెందగా శనివారం దశదిన కర్మ సందర్భంగా వారి చిత్రపటానికి తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ అధ్యక్షులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం నివాళులర్పించి,వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.వారి వెంట నివాళులర్పించిన వారిలో టీడీపీ మండల అధ్యక్షుడు రావుట్ల సత్యనారాయణ,తెదేపా నాయకులు గద్దం రమేష్, నందమూరి సత్యనారాయణ, తూము పురుషోత్తరావు,సంద్ర ప్రసాద్ మామిళ్ల నరసింహారావు,పారా వెంకటేశ్వర రావు, మండేపూడి గోర్కె,మండేపూడి మోహన్ రావు, ఏసుపోగు నాగేశ్వరరావు పాటిబండ్ల సుబ్బారావు,సాదినేని కొండలరావు,కంచర్ల చిన్నప్ప తదితరులు ఉన్నారు.

# మహాసభలను జయప్రదం చేసిన జర్నలిస్టులకు ధన్యవాదాలు

**జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. టియుడబ్ల్యూజె (ఐజేయు) మండల కన్వీనర్ తేళ్ల శ్రీనివాసరావు.**



**కారేపల్లి,జూన్ 22 , ప్రజా జ్యోతి:** జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, జర్నలిస్టులు వృత్తి నైపుణ్యంలో ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని టియుడబ్ల్యూజె (ఐజేయు) కారేపల్లి మండల కన్వీనర్ తేళ్ల శ్రీనివాసరావు అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ఖమ్మంలో జరిగిన తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (ఐజేయు) మూడవ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేసిన జర్నలిస్టులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు రోజులపాటు జరిగిన రాష్ట్ర మహాసభలు ఖమ్మంలో ఏర్పాటు చేయడం అభినందనీయమని, ఆ సభలు ఆద్యంతం ఎంతో ఉత్సాహపరితంగా సాగిందని అన్నారు.జర్నలిస్టులు వృత్తి నైపుణ్యం పెంచుకోవాలని,సమాజంలో ఆ వృత్తి పట్ల గౌరవాన్ని పెంచుకునే బాధ్యత కూడా వర్కింగ్ జర్నలిస్టులపైనే ఉందని అన్నారు.గత ప్రభుత్వంలో జర్నలిస్టులకు అన్యాయం జరిగిందన్న విషయం అందరికీ తెలిసిందేనన్నారు.అర్హులైన అందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ప్రభుత్వం ఒక విధానం పరమైన నిర్ణయాన్ని రూపొందిస్తుందని ఈ సందర్భంగా తెలిపారు.

# రోడ్డు ప్రమాద బాధితుడికి డాక్టర్ రాజశేఖర్ గౌడ్ ఆపన్న హస్తం

**రక్తస్రావం, తీవ్ర గాయాలతో బాధపడుతున్న క్షతగాత్రుడిని తన వాహనంలో ఆసుపత్రికి తరలింపు**

**అత్యవసర విభాగంలో చికిత్స పొందుతున్న బాధితుడు, నిలకడగా అతని ఆరోగ్యం**

**ఖమ్మం, జూన్ 22 ప్రజా జ్యోతి:** రోడ్డు ప్రమాద బాధితుడికి నేలకొండపల్లి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ కేస గాని రాజశేఖర్ గౌడ్ ఆపద్బాంధవుడిగా నిలిచారు. తన సొంత వాహనంలో ఆసుపత్రికి తీసుకెళ్లి.. సకాలంలో అత్యవసర వైద్యం అందే లాగా చేశారు. ప్రస్తుతం ఆ బాధితుడి ఆరోగ్యం నిలకడగా ఉంది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఖమ్మం జిల్లా వెంకటగిరి క్రాస్ రోడ్ ఇందిరమ్మ కాలనీకి చెందిన విజయ్(35) వ్యక్తిగత పనిమీద ఖమ్మం నగరానికి వెళ్లి వస్తున్నాడు. ఈ క్రమంలో అతడు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని మరో వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో విజయ్ తీవ్రంగా గాయపడ్డాడు. రక్త స్రావం కూడా తీవ్రంగా అయింది. ఆచేతనంగా రోడ్డు మీద పడి ఉన్న అతడిని.. డాక్టర్ రాజశేఖర్ గౌడ్ చూసి చలించి పోయారు. అదే మార్గం మీదుగా తన వాహనంలో వస్తున్న డాక్టర్ రాజశేఖర్ గౌడ్ మరో మాట ఆలోచించకుండా విజయ్ ని తన వాహనంలో ఎక్కించుకున్నారు. అక్కడికక్కడ ప్రథమ చికిత్స చేసి, మెరుగైన వైద్యం కోసం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి



అత్యవసర వైద్య విభాగంలో విజయ్ చికిత్స పొందుతున్నారు. విజయ్ తండ్రి వెంకటేశ్వర్లు భవన నిర్మాణ మేస్త్రి గా పని చేస్తున్నారు. సకాలంలో స్పందించి విజయ్ ప్రాణాన్ని కాపాడిన డాక్టర్ రాజశేఖర్ గౌడ్ ను పలువురు నగరవాసులు అభినందించారు.

# పొంగులేటి సమక్షంలో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



**40 మంది లబ్ధిదారులకు పంపిణీ చేసిన రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

**తిరుమలాయపాలెం, జూన్ 22, ప్రజా జ్యోతి :** రాష్ట్రంలో రైతాంగానికి రూ.31 వేల కోట్లతో రైతుల రుణమాఫీ జరుగుతుందని హామీల నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుంటుందని రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని మండలం బచ్చోడు, హస్నాబాద్, లక్ష్మీదేవికి పల్లి తండా, సుబ్లేడు, మేడిపల్లి, ఆయా గ్రామంలో పర్యటించిన ఆయన 40 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రుణమాఫీ కోసం అన్ని సమకూరుస్తున్నామన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో వచ్చే నెల జూలై నుంచి రుణమాఫీ అమలవుతుందని తెలిపారు. రూ.31 వేల కోట్లతో రైతుల రుణమాఫీ జరుగుతుందని వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్లు అర్హులైన పేదవాళ్లకు ముందు మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ పివి రామకృష్ణ, ఎంపీడీవో శేషాద్రి కాంగ్రెస్ జిల్లా నాయకులు చావా శివరామకృష్ణ, రామ సహాయం నరేష్ రెడ్డి, జెడ్పిటిసి బెల్లం శ్రీనివాస్, ఎంపీపీ బోడ మంగీలాల్, మాజీ సర్పంచ్ రామ సహాయం హరిత రెడ్డి, ప్రముఖ న్యాయవాది రామ సహాయం అరవింద్ రెడ్డి, మిరియాల విక్రమ్ రెడ్డి, పోట్ల కిరణ్, లంజపల్లి శ్రీనివాస్, మోర విజయపాల్ రెడ్డి, దూదిమెట్ల వెంకట్,, జాల కిరణ్, పల్లె మల్లయ్య, కొజ్జా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



## కేంద్ర ప్రభుత్వ మెడలు వంచి విద్యార్థులకు న్యాయం జరిగే వరకు అఖిల పక్షాల పోరాటం కొనసాగుతుంది

**- జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు యడ్లపల్లి సంతోష్**

**యువజన సంఘాల ఆందోళనతో దద్దరిల్లిన వైరా రోడ్**

**పాల్గొన్న అఖిల పక్ష విద్యార్థి యువజన సంఘాల నాయకులు**

**నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నీ రద్దు చేయాలి**

**ఇది ముమ్మాటికీ కేంద్ర ప్రభుత్వ అసమర్థత దోషులను కఠినంగా శిక్షించాలి**




**ఖమ్మం జూన్ 22 ప్రజా జ్యోతి:** ఈ కార్యక్రమంలో పాల్గొన ఎన్ ఎస్ యు ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ ఆసిఫ్,నవీన్, యూత్ కాంగ్రెస్ ఖమ్మం, పాలేరు, సత్తుపల్లి అసెంబ్లీ అధ్యక్షులు కొండూరి హృదయ్ కిరణ్,బొల్లం మహేష్ యాదవ్, హుసేన్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి బెజ్జం గంగాధర్, పాలేరు ఉపాధ్యక్షులు సురేష్ నాయక్, కారేపల్లి,తిరుమలయపాలేం, జూలూరుపాడు, ఏన్కూర్ మండల అధ్యక్షులు హర్ష నాయక్, బత్తుల రమేష్,అనీల్, భూక్యా రవి,1 టౌన్ నాయకులు మారబోయిన రామకృష్ణ, 2 టౌన్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారుల భావాల కనుగుణంగా బోధించాలి.

**సిడిపివో,ఎన్. దయామని.**

**కారేపల్లి, జూన్ 22,ప్రజాజ్యోతి:** చిన్నారులకు ప్రాథమికంగా అక్షరాలు వారి ఆలోచనలు భావాల కనుగుణంగా అంగన్వాడి టీచర్లు బోధించాలని కారే 'పల్లి,కామేపల్లి మండలాల ప్రాజెక్ట్ సిడిపిఓ ఎన్ దయామణి అన్నా రు. సింగరేణి మండల పరిధిలోని అప్పయిగూ డెం గ్రామపంచాయతీ పరిధిలో గల రైతు వేదికలో శనివారం అంగన్వా డీ టీచర్లకు మొదటి బ్యాచ్ మూడు రోజులపాటు నిర్వహించే శిక్షణా తరగతులు ముగిసాయి. ఈ సందర్భంగా సిడిపిఓ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలలో నూతన జాతీయ వి ద్యా విధానంలో భాగంగా సవరించిన ప్రీస్కూల్ పాఠ్యాంశాలపై అంగన్వాడీ టీచర్లు పూర్తి అవగాహన కలిగి ఉండాల న్నారు.పిల్లల మెదడు అభివృద్ధి ప్రక్రియపై అవగాహన, పూర్వ బాల్య దశ ప్రాముఖ్యత, పిల్లల సమగ్ర అభివృద్ధిలో పూర్వ ప్రాథమిక విద్య యొక్క ఆవశ్యకతగురించి వివరించారు.ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు కే. రమాదేవి, కే. సుభద్ర,పుష్ప,రోహిణి ,రాధ తోపాటు పలువురు అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.



# రైతులు తీసుకున్న రుణాలను మాఫీ చేయాలని తీసుకున్న నిర్ణయం పై హర్షం వ్యక్తం చేసిన రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు



**ఖమ్మం జూన్ 22 ప్రజా జ్యోతి.:** వరంగల్ రైతు డిక్లరేషన్ లో శ్రీ రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం రైతులకు ఒకే దఫా లో రూ. 2 లక్షల రుణమాఫీ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయం పై రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు.. ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ పార్టీ రైతులను ఆదుకుంటుందని,ఆర్థికంగా ఎంత కష్టమున్న ఇబ్బంది ఉన్న రుణమాఫీ చేస్తున్నందుకు ముఖ్యమంత్రి,మంత్రి వర్గనికి కృతజ్ఞతలు తెలిపారు..

# రోడ్డు ప్రమాదంలో కలకోట వ్యక్తి మృతి



**బోనకల్, జూన్ 22,ప్రజాజ్యోతి,:** మండలంలోని కలకోట గ్రామానికి చెందిన తోటపల్లి జార్జి (28) తల్లాడ నుంచి కల్లూరు వెళ్ళే రోడ్డు వెంకటగిరి వైపు ద్విచ్రవాహనంపై వెళ్తుండగా ఎదురుగా ఉన్న గేదెను ఢీకొట్టడంతో జార్జి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందడం జరిగింది.ప్రస్తుతం జార్జి వైరా పెట్రోల్ బంకులో కుటుంబ పోషణ నిమిత్తమై పనిచేస్తున్నాడు.మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.జార్జి మరణ వార్త విన్న వారి కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు.వారి కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామ ప్రజలు కోరుకుంటున్నారు.

# లయన్స్ క్లబ్ ఆఫ్ ఖమ్మం వారి ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేత

**ఖమ్మం జూన్ 22 ప్రజా జ్యోతి:** లయన్స్ క్లబ్ ఆఫ్ ఖమ్మం వారి ఆధ్వర్యంలో ఈ రోజు లయన్ సభ్యుల ఆర్థిక సహకారంతో కమాన్ బజారులో గత 30 సంవత్సరముల నుండి టీ అమ్ముతున్నటువంటి కొండా వారి అమ్మాయి వికలాంగురాలైన రాశి పెళ్లి ఖర్చుల నిమిత్తం రు 10000/- లు ఖమ్మం లో అందజేశారు. ఈ సందర్భంగా ప్రెసిడెంటు క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ వికలాంగురాలైన అమ్మాయి పెళ్ళికి ఆర్థిక సహాయం చేయడం ఆనందంగా ఉందని అన్నారు. ఇంకా రాబోవు రోజులలో ఇటువంటి మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని తెలిపినారు. ఈ కార్యక్రమములో అధ్యక్షులు తల్లపురెడ్డి క్రిష్ణారెడ్డి, కార్యదర్శి వేముల హనుమంతరావు, జోన్ చైర్మన్ డాక్టరు డి.సి.సి. రావు, పాయల నాగేశ్వరరావు మరియు లయన్ సభ్యులు కమర్తపు కిరణ్,దుర్గా నాగేశ్వరరావు, అత్తలూరి గోవర్ధన్, అబ్దుల్ అలీం మరియు కొండా, రాశి తదితరులు పాల్గొన్నారు.




# రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన రశీదును భద్రపరుచుకోవాలి

**జిల్లా వ్యవసాయ అధికారిణి ముండ్లపాటి విజయనిర్మల**

మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో జిల్లా వ్యవసాయ అధికారిణి ముండ్లపాటి విజయనిర్మల ఏవో సర్వసుద్ధి సరితా తో కలిసి పత్తి జనుము,జీలుగ పచ్చిరొట్ట పైర్లను సందర్శించారు. ఈ క్షేత్ర సందర్శనలో రైతులకు తగు సూచనలు సలహాలు తెలియజేశారు. పత్తి సాగుకి నేలలో తగిన పదును ఉన్నప్పుడు మాత్రమే విత్తుకోవాలి. 60 మి.మీ వర్షపాతం నమోదు అయినప్పుడే పత్తి సాగుకి నేల అనుకూలంగా ఉంటుందనీ తెలిపారు. అదేవిధంగా విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు తప్పకుండా రశీదు పొందాలనీ,విత్తన కొనుగోలు రశీదును విత్తన ప్యాకెట్ ను పంటకాలం పూర్తయ్యే వరకు భద్రపరుచుకోవాలి అని పేర్కొన్నారు. రశీదును భద్రపరుచుకోవడం ద్వారా జన్యుస్వచ్ఛత లోపాల వల్ల లేదా మొలక శాతం తక్కువైనప్పుడు తగిన పరిహారం కోరే హక్కు రైతుకు ఉంటుందనీ అన్నారు. పచ్చిరొట్ట పైర్లు జనుము,జీలుగ సాగు ద్వారా నేల సారాన్ని పెంపొందించడంతో పాటు రసాయన ఎరువులపై పెట్టె పెట్టుబడి ఖర్చు కొంతమేర తగ్గించవచ్చునీ అన్నారు. పచ్చిరొట్ట పైర్లు సాగు ద్వారా కలుపు మొక్కల



పెరుగుదలను నిరోధించి,నేల భౌతిక స్థితి మెరుగుపడి నీరు ఇంకే గుణం పెరుగుతుందనీ తెలిపారు. వ్యవసాయ విస్తరణ అధికారులు నమోదు చేసే పంటల నమోదు ద్వారా భవిష్యత్ లో పంటల కొనుగోలు, పంటల సాగు లెక్క ఖచ్చితత్వం, ఎరువుల సరఫరా మరియు ప్రభుత్వ పథకాల అమలుకు ప్రామాణికంగా నిలుస్తుందనీ ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సర్వసుద్ధి సరితా,వ్యవసాయ విస్తరణ అధికారి బద్దల కార్తీక్,రైతులు పాల్గొన్నారు.

# స్పెషల్ ఆఫీసర్లు, ఎస్ఐలు, జవాన్లతో సమీక్ష నిర్వహించిన కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్- సంపత్ కుమార్

**ఖమ్మం కార్పొరేషన్ జూన్ 22 ప్రజా జ్యోతి.:** గౌరవ కలెక్టర్ ఆదేశాల అనుసారం అసిస్టెంట్ కమిషనర్ సంపత్ కుమార్ ఈరోజు స్పెషల్ ఆఫీసర్, ఎస్ఐలు, జవాన్లతో, మీటింగ్ ఏర్పాటు చేసి కాలువల పూడికతీత పనులు నత్తనడకన నడుస్తున్నందున వాటిని వేగవంతం చేయాలని సంబంధిత స్పెషల్ ఆఫీసర్ లకు ఆదేశాలు జారీ చేశారు. ప్రతి స్పెషల్ ఆఫీసర్ మరియు ఎస్సైలు అందరూ ప్రతిరోజు తమ డివిజన్లో కాలువలు తీస్తున్నారా లేదా అనేది పర్యవేక్షించాలన్నారు. అంతే ఏ రోజు ఎక్కడ కాలువ తీశారు అనేది కూడా నోట్ చేసుకున్న బుక్ ప్రతిరోజు పరిశీలించాలని అన్నారు. అదేవిధంగా ప్రతిరోజు ఎస్ఐలందరూ వారికి సంబంధించిన డివిజన్లో ఎక్కడెక్కడ కాలవలు తీస్తారు, ఎంత మేరకు తీశారు అనేది పరిశీలించాలని ఎక్కడైనా కాలువ పుడిపోయి నీళ్లు పోకుండా ఎక్కడైనా కనిపించిందో అక్కడ వర్కర్స్ ని పెట్టి త్వరగా శుభ్రం అయ్యేలా చర్యలు చేపట్టాలని చెప్పడం జరిగినది. ఎవరికైనా ఎక్కడైనా జెసిపి అవసరం ఉన్నచో తమ దృష్టికి తీసుకురావాలని అసిస్టెంట్ కమిషనర్ ఎస్ఐలకి చెప్పారు . ఎస్ఐలందరూ డివిజన్ మీద పనిచేస్తున్నటువంటి వర్కర్ల అటెండెన్స్ ప్రతిరోజు పరిశీలించాలని ఎవరెవరు రావడం లేదు అనేది చూసి అటెండెన్స్ వేయాలని సంబంధిత జవాన్లు ఎవరైనా సరిగా అటెండెన్స్




తీసుకోపోతే వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయని అంతే సంబంధిత ఎస్సై కూడా ప్రతిరోజు అటెండెన్స్ మానిటరింగ్ సరిగా చేయకపోతే వారి పైన కూడా చర్యలు చేపడతామని అన్నారు మాంసం సీజన్ వల్ల వర్షాలు పడుతున్నందున రోడ్ల పైన పెట్టినటువంటి కొబ్బరి బొండాలు, పండ్లు బండ్లు వారి దగ్గర చెత్త కాలువలో వేయకుండా చూడాలని షాపులు వాళ్ళు ఎవరైనా చెత్తని కాలువల్లో వేసినచో వారిపై చర్యలు తీసుకోవాలని చెప్పడం జరిగినది.

# భాగం భాగేశ్వరరావు దశ దిన కార్యక్రమంలో పాల్గొన్న పలువరు ప్రముఖులు



**బోనకల్,జూన్ 22, ప్రజా జ్యోతి:** గోవిందాపురం ఏ గ్రామ వాసి భాగం రమేష్ తండ్రి భాగం భాగేశ్వరరావు ఇటివలే మరణించగా వారి దశదినకర్మకు మండల తహశీల్దార్ అనిశెట్టి పున్నం చందర్,ఆర్ఐ జీ లక్ష్మణ్ శ్రీ రక్షా హాస్పిటల్ అధినేత జివి పాల్గొని వారి చిత్ర పటానికి ఘన నివాళి అర్పించారు. నివాళులు అర్పించిన వారిలో మాజీ సర్పంచ్ సైదా నాయక్,మర్రి తిరుపతిరావు,పారా లక్ష్మీనారాయణ,భాగం నాగేశ్వరరావు ఉన్నారు.

# రెండు కోట్ల 20 లక్షలు మిర్చి రైతులకు టోకరా పెట్టిన మిర్చి వ్యాపారి



**ఎర్రుపాలెం, జూన్ 22, ప్రజాజ్యోతి :** మండలంలోని ములుగుమాడు గ్రామంలో మిర్చి రైతులకు రెండు కోట్ల రూపాయల లక్షలు రూపాయలు టోకరా పెట్టిన ఖరీదు కృష్ణారావు అనే మిర్చి వ్యాపారి పై ఎర్రుపాలెం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు ఇచ్చిన రైతులు. బాధిత రైతులు చెప్పిన వివరాల ప్రకారం గ్రామంలో నాలుగు సంవత్సరాల నుండి రైతులు దగ్గర మిర్చి కొనుగోలు చేస్తూ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. అలానే ఈ సంవత్సరం 1000 క్వింటాల వరకు మిర్చి రైతులు దగ్గర 15 రోజులు గడువుతో కొనుగోలు చేసి గుంటూరు మార్కెట్ కి తరలించాడు. నాలుగు నెలలు గడుస్తున్న రైతులకు డబ్బులు ఇవ్వకుండా కాలం గడుపుతున్నాడు. నాటి నుండి నేటి వరకు తమకు మిర్చి నిమిత్తం చెల్లించాల్సిన డబ్బులను వాయిదాలు వేసుకుంటూ వచ్చాడన్నారు. ప్రస్తుతం తాము గట్టిగా డబ్బుల విషయమై నిలదీయడంతో కృష్ణారావు, అతని కుటుంబ సభ్యుల నుండి నిర్లక్ష్యపు సమాధానం రావడంతో తాము తమ మిర్చి పంట డబ్బులు ఇప్పించాలంటూ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

# ఐఐటీ , ఎన్ఐటీలో సీట్లు సాధించిన విద్యార్థులకు సన్మానం.



**కూసుమంచి జూన్22 ప్రజా జ్యోతి :** ఐఐటీ బాంబే, ఎన్ఐటీ మిజోరంలలో సీట్లు సాధించిన పూర్వ విద్యార్థులను శనివారం కూసుమంచి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయల వీరస్వామి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కూసుమంచి ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు చదివిన విద్యార్థులు బానోత్ నవ్యకు ఐఐటీ బాంబేలో , వై ఉమేష్ చంద్ర ఎన్ఐటీ మిజోరంలో సీట్లు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి కేశవపట్నం రవికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఐఐటీ, ఎన్ఐటీలలో సీట్లు సాధించడం గర్వకారణమన్నారు. కార్పొరేట్ కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన కొనసాగుతుందన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల కృషిని అభినందిచారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలన్నారు. వాటిని సాధించడం కోసం నిరంతరం శ్రమించాలన్నారు. ఇప్పటి నుంచి అనుకున్న లక్ష్యం కోసం ముందుకు సాగితే అది సాధించడం కష్టం ఏమీ కాదన్నారు. ఇప్పటి నుంచి అనుకున్న లక్ష్యం కోసం ముందుకు సాగితే అది సాధించడం కష్టం ఏమీ కాదన్నారు. విద్యార్థులు ఎంతటి కష్టం ఎదురైనా ధైర్యంగా ఎదుర్కొంటూ లక్ష్యం వైపు ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

# విద్యార్థుల హాజరు శాతంపై దృష్టి పెట్టాలి





**జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి కే రవికుమార్**

**కూసుమంచి జూన్22 ప్రజా జ్యోతి :** విద్యార్థుల హాజరు శాతంపై ప్రత్యేక దృష్టి పెట్టి తల్లిదండ్రులను సంప్రదించాలని, సరైన కారణాలు తెలుసుకొని విద్యార్థులు ప్రతిరోజు పాఠశాలకు క్రమంతప్పకుండా వచ్చేలా చూడాలని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి కే రవికుమార్ సూచిం చారు. శనివారం ఏఎంవో రవికుమార్ కూసుమంచి, జక్కేపల్లి ఉన్నత పాఠశాలలు, కేజీబీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ సూచించిన పలు అంశాలను ఉపాధ్యాయులకు తెలిపారు. బేస్‌లైన్ టెస్టులు నిర్వహించి విద్యార్థుల సామర్థ్యాల ఆధారంగా బోధన చేయాలన్నారు. ఉపాధ్యాయుల హాజరుపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రార్థన సమయానికి పాఠశాలకు చేరుకోవాలన్నారు. ప్రతి మూడో శనివారం జరిగే పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో పిల్లల యాక్టివిటీస్‌ని తెలియజేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన అనేకమంది ఉన్నతమైన స్థానాలు అధిరోహించారని, ప్రస్తుతం ఉన్న స్థితిగతులు, ఉపాధ్యాయులు చేస్తున్న కృషి, కల్పించిన వసతులు, అలాగే విద్యార్థుల గొప్పతనాన్ని ప్రదర్శించాలననారు. ఈ కార్యక్రమంలో జీసీడీవో భూలక్ష్మి, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రాయల వీరస్వామి, పోటు శ్రీనివాసరావు , కేజీబీవీ ఎస్వో అజిత కుమారి పాల్గొన్నారు.

# చాప పిల్లలకు వచ్చే వ్యాధుల గురించి మత్స్యకారులకు అవగాహన సదస్సు

**కూసుమంచి జూన్22 ప్రజా జ్యోతి :** మత్స్య పరిశోధన స్థానం, పాలేరు, పి.వి నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయము హైదరాబాదు వారి ఆధ్వర్యంలో, భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి షెడ్యూల్ కులాల ఉప ప్రణాళిక, వ్యవసాయ మరియు రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ భారత ప్రభుత్వము న్యూఢిల్లీ వారి ఆర్థిక సహకారంతో, తెలంగాణ మత్స్య కారులకు జరుగుతున్న రీ సర్క్యులేటరీ ఆక్వాకల్చర్ సిస్టమ్స్-అధునాతన సాంకేతిక పరిజ్ఞానం అను అంశంపై 3 రోజుల నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమంలో డాక్టర్ ఎం. శ్యామ్ ప్రసాద్, సీనియర్ శాస్త్రవేత్త మరియు హెడ్ మాట్లాడుతూ... "రీసెర్క్యులేటరీ ఆక్వాకల్చర్ సిస్టమ్స్ ను" పూర్తిగా సద్వినియోగపరుచుకొని మత్స్య రైతులు తెలంగాణ రాష్ట్రంలో చేపల దిగుబడిని మరింత పెంచగలరని తెలిపారు. పాలేరు ఎంపీటీసీ శీలం నాగమణి మాట్లాడుతూ తెలంగాణ మత్స్య రైతులు ఆక్వాకల్చర్ రంగంలో ముందుకు రాణించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్న సబ్సిడీ పథకాలతో పాటు బ్యాంకులలో రైతులకు ఉండే వివిధ పథకాలు మరియు లోన్లను కూడా ఉపయోగించుకొని ఆక్వా రంగంలో మరింత అభివృద్ధి సాధించాలని కోరారు. కుమారి శ్రీ టి. భార్గవి సీనియర్ రీసెర్చ్ ఫెలో మత్స్య పరిశోధన స్థానం పాలేరు లో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకాల ప్రాముఖ్యత ఉపయోగాల గురించి షెడ్యూల్ కులాల మత్స్య రైతులకు క్లుప్తంగా వివరించారు. బి. రవీందర్ మత్స్య శాస్త్రవేత్త, మత్స్య పరిశోధన స్థానం పాలేరు లో ఆక్వాకల్చర్ సిస్టమ్స్ లలో" నీటి నాణ్యత ప్రమాణాలు, వాటి యొక్క ప్రాముఖ్యత, యాజమాన్యం మరియు వాటి యొక్క సగటు విలువల గురించి మత్స్య రైతులకు సంక్షిప్తంగా తెలియజేశారు. ఎస్. నాగరాజు సీనియర్ రీసెర్చ్ ఫెలో మత్స్య పరిశోధన ఆక్వా కల్చర్ సిస్టమ్స్ లలో సర్వసాధారణంగా వచ్చే చేపల వ్యాధులను గూర్చి మరియు వాటి యొక్క నివారణ మార్గాలను గురించి అదేవిధంగా చేపలకు వచ్చే వ్యాధులను నిర్ధారించడానికి, వ్యాధి నివారణ చర్యలు చేపట్టడానికి, కేంద్ర ప్రభుత్వం వారి సహకారంతో ఎన్ బి ఎఫ్ జి ఆర్ మరియు నాస్ఫాడ్ వారు కలిసి సంయుక్తంగా ప్రవేశపెట్టిన "రిపోర్ట్ ఫిష్ డిసీజెస్ యాప్ గురించి తెలంగాణ మత్స్య రైతులకు సవివరంగా వివరించడం జరిగింది. చివరిగా ప్రశంస పత్రాలను మత్స్య రైతులకు అందించారు. ఈకార్యక్రమంలో ఖమ్మం, సూర్యాపేట జిల్లాలో మత్స్యకారులు సుమారు 25 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# వైరా రిజిస్టార్ కార్యాలయం ముందు స్థానికులు నిరసన

**వైరా, జూన్ 22 (ప్రజా జ్యోతి):** వైరా మున్సిపాలిటీ పరిధిలోని దిద్దుపూడి గ్రామంలో ఉన్న గ్రామ కంఠం భూమిలో రెండు దశాబ్దాల కాలం క్రితం నిరుపేద స్థానికులు ఇల్లు నిర్మించుకున్నారు. ఆ భూమి లోతట్టు ప్రాంతం కావడంతో వర్షాలకు ఇండ్లు తడిసి నేలమట్టమయ్యాయని ఆ పరిస్థితుల్లో వేరే ప్రాంతంలో ఇల్లు నిర్మించుకొని జీవిస్తున్నామని తెలిపారు. మేము నివసించిన స్థలాల్లో స్థానిక అక్రమార్కులు తమ భూమిని అక్రమ రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే ఇంటి నెంబర్ పై ముగ్గురు వ్యక్తులు 1100 గజాల స్థలాన్ని అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని , మరి కొంతమంది మరో వెయ్యి గజాలను రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని వాటిని వెంటనే రద్దు చేయాలని ఆగ్రహం వ్యక్త పరిచారు. గ్రామ కంఠం భూమిని అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని రిజిస్ట్రార్కు వినత పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

# వర్షం.. హర్షం

వరకు కుండపోత వర్షం కురిసింది. దీంతో వాగులు, చెరువులకు కొత్తనీరు చేరుతున్నది. లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. రైతులు నార్లు పోసుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఆనందంతో దుక్కులు దున్నుకుంటున్నారు. వర్షం కారణంగా పలు గ్రామాల్లో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది.

**ఖమ్మం నగరంలో..**

ఖమ్మం నగరంలో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. కొద్దిరోజులుగా తీవ్ర ఉక్కపోతతో అల్లాడుతున్న నగరవాసులకు ఉపశమనం కలిగింది. శనివారం ఉదయం నుంచి మేఘాలు అలుముకోవడంతో వాతావరణం చల్లబడింది. మధ్యాహ్నం ఒక్కసారిగా వర్షం కురిసింది. నగరంలో ట్రాఫిక్‌కు స్వల్ప అంతరాయం కలిగింది. పాదచారులు, ద్విచక్ర వాహనదారులు కొంత అసౌకర్యానికి గురయ్యారు.

పెనుబల్లిలో మండలవ్యాప్తంగా శుక్రవారం రాత్రి నుంచి చిరు జల్లులతో మొదలై శనివారం ఉదయం వరకు మోస్తరు వర్షం కురిసింది. దీంతో వారం రోజుల క్రితం కరివేద విధానంలో చల్లిన రైతులు వడ్లు మొలకెత్తడంతో పొలం పనుల్లో నిమగ్నమయ్యారు. కొందరు సాయంత్రం వరకు వర్షం ఎక్కువగా కురుస్తుందేమోననే ఉద్దేశంతో నీళ్లు బయటకు తరలించేందుకు ప్రయత్నాలు సాగించారు. వీఎం బంజర, టేకులపల్లి, లంకాలపాడు గ్రామాల్లో అధిక వర్షం కురవడంతో రైతులు సాగుపై దృష్టి సారించారు.